

సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం, 1, సెప్టెంబర్, 2023



రెయిన్‌గన్ల జాడేదీ..!

వేరుశనగ పంటను కాపాడేందుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సరఫరా చేసిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్ల జాడే లేకుండా పోయింది.

-8లో..



తొలగించిన ఓట్లపై విచారణ

తొలగించిన ఓట్లపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. అర్హులైన ఓటర్లను తొలగిస్తే చర్యలు తప్పవన్నారు.

-8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 295 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	582	582
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 73.380 కిలోలు

న్యూస్‌రీల్

పరీక్ష రుసుము చెల్లింపునకు సెప్టెంబర్ 15 తుది గడువు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష అనుత్తీర్ణులైన విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరం మార్చి నెలలో పరీక్ష రాసేందుకు సెప్టెంబర్ 15వ తేదీలోగా రుసుము చెల్లించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంలు విద్యార్థులకు సూచించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు సబ్జెక్టులకంటే తక్కువ అనుత్తీర్ణులైన వారు రూ.110, మూడు కంటే ఎక్కువ ఉంటే రూ.125 రుసుము చెల్లించాలన్నారు. గడువు దాటితే సెప్టెంబర్ 30వ తేదీ వరకు రూ.50 ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని తెలిపారు.

1435 మంది రైతులకు రూ.2 కోట్ల పరిహారం

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌జిల్లాలో అధిక వర్షాలతో ఈ ఏడాది మే, జూన్ నెలల్లో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన వారి ఖాతాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి పంట నష్టపరిహారం నేడు జమ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1435 మంది రైతులు 817.38 హెక్టార్లలో పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ నష్ట పరిహారంగా రూ. 2,02,65,375లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. 11 అంగన్వాడీ వర్కర్లు, 72 సహాయకురాళ్లు 72, ఇద్దరు మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులైన వారు సెప్టెంబరు 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 13న ఉదయం 11 గంటలకు సంబంధిత ఆర్డీఓ కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు https://kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

5న బద్వేల్‌లో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు సెప్టెంబరు 5న బద్వేలులోని ఎస్‌ఆర్‌ఎస్‌టీ పీజీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హులను ఎంపిక చేస్తారన్నారు. 18–30 సంవత్సరాల వయస్సు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.apssdc.in లింక్‌లో తమ పేర్లు రిజిష్టర్ చేసు కోవాలన్నారు. ఇతర వివరాలకు 63001 25455, 90636 23706 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డైరెక్టర్ జె.మురళి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ ఉద్యోగులు ధ్యానం అలవాటు చేసుకుని ఒత్తిడికి దూరం కావచ్చునని ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రేడ్–1, గ్రేడ్–5 గ్రామ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఉద్యోగులకు అసూయ, ద్వేషం, ఒత్తిడి, కోపం, భయం ఉంటే శక్తిని కోల్పోతారన్నారు. పాజిటివ్ దృక్పథం అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలకు సైన్స్‌లో 3, ఆర్ట్స్ విభాగంలో 1 సబ్జెక్టు నందు ఆనర్స్ డిగ్రీ కోర్సుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మ్యాథమ్యాటిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లోను, ఎకనామిక్స్‌లో 4వ సంవత్సరం ప్రవేశాలు పొందవచ్చన్నారు. 2020–23 బ్యాచ్‌లో డిగ్రీ పూర్తి చేసి 75 శాతం ఉత్తీర్ణత పొందిన మహిళా అభ్యర్థినులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ 4 సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ పూర్తి చేసినవారు పీజీలో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

ఇక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

- నేటి నుంచి ప్రారంభం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రిజిస్ట్రేషన్లశాఖ డిజిటలైజేషన్ వైపు పరుగులు పెడుతోంది. ఇందులో భాగంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. వేగంతో కూడిన సేవలు అందించడంతోపాటు ఆస్తుల బదలాయింపులో అక్రమాలకు తావు లేకుండా కచ్చితంగా ఉండేవిధంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్‌శాఖ అనుసంధానం చేస్తోంది.


కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్‌శాఖ కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు (కార్డు) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకీకరించి కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రూపొందించింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా స్థిరాస్తుల లావాదేవీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనుంది. దీంతో క్రయ విక్రయదారులకు సమయం వృథా కాకుండా నిమిషాల వ్యవధిలోనే వేగవంతంగా సేవలు అందనున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకత ఏమిటంటే డాక్యుమెంట్లు కొనుగోలు చేయాల్సిన పని ఉండదు. దస్తావేజులను పూరించాల్సిన అవసరం అంతకన్నా ఉండదు. ఒక రకంగా చెప్పాలంటే మీ డాక్యుమెంట్లను మీరే ఆన్‌లైన్‌లో పూరించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్‌లో సూచించిన సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అలాగే ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ఫీజు, చలానా సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్థిరాస్తుల క్రమ విక్రయదారులకు ప్రత్యేకంగా ఓటీపీలు వస్తాయి. అధికారులకు సమాచారం చెబితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి డాక్యుమెంట్లు ప్రింట్‌తోపాటు కొనుగోలుదారులు, అమ్మకందారుల మెయిల్‌కు వస్తాయి.

నేటి నుంచి అమలులోకి..

కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిష్టర్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. వైఎస్సార్ జిల్లాలో 12, అన్నమయ్య జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇప్పటికే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం తమకు కన్వీనియంట్ టైమ్‌లో స్లాట్ బుక్‌చేసుకుని కేవలం 20 నిమిషాల సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానాన్ని వినియోగదారులు విరివిగా వినియోగించుకుని మధ్యవర్తులపై ఆధారపడకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరంగా పూర్తి చేసుకోవచ్చు.

అవగాహన కల్పించాం



స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వినియోగదారులకు మరింతగా చేరువ చేసేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కార్డు సాఫ్ట్‌వేర్‌ను ఆధునికరించి ప్రైమ్ 2.0ను రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానం క్రయ విక్రయదారులకు సులభంగా ఉంటుంది. అవకతవకలు జరగవు. అలాగే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఈ నూతన విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – శివరాం, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రానున్న కార్యాలయాలు

వైఎస్సార్ జిల్లాలో..
కడప ఎస్‌ఆర్‌ఓ జాయింట్–1, 2, కడప రూరల్, బద్వేలు, సిద్దవటం, దువ్వూరు, జమ్మలమడుగు, కమలాపురం, ముద్దనూరు, మైదుకూరు,ప్రొద్దుటూరు ఎస్‌ఆర్‌ఓ జాయింట్–1, 2, పులివెందుల, వేంపల్లె, కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం.

అన్నమయ్య జిల్లాలో..
చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, పుల్లంపేట, రాజంపేట, రాయచోటి, టి.సుండుపల్లె, పీలేరు, వాయల్పాడు, కలికిరి, మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, రాయచోటి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం.

తిరుమల ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు!

తిరుపతి వరకే పరిమితం



తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

రాజంపేట: ముద్దనూరు–మంగపట్నం మధ్య ట్రాఫిక్‌ను బ్లాక్ చేయనున్నారు. బ్రిడ్జి వద్ద పనులు చేస్తున్న క్రమంలో ఆ తేదీల్లో నడిచే రైళ్లను దారిమళ్లింపు, రద్దు లాంటి చర్యలను రైల్వేశాఖ చేపట్టింది. ఈనేపథ్యంలో విశాఖ–తిరుపతి–కడప మధ్య నడిచే తిరుమల(17488)ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 4, 5, 9తేదీల్లో రద్దు చేశారు. 17487 కడప నుంచి విశాఖ మధ్య నడిచే రైలును ఈ నెల 5, 6, 10న రద్దు చేశారు. ఫలితంగా తిరుమలను తిరుపతి వరకు పరిమితం చేశారు. కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ముద్దనూరు–మంగపట్నం మధ్య బ్లాకింగ్ ఇచ్చిన క్రమంలో తిరుమల కొండాపురానికి నీటి కోసం వెళ్లలేని పరిస్థితి. కడప వరకైనా నడిపించకుండా కేవలం కొండాపురం వెళ్లేందుకు మార్గం లేకనే తిరుమల రద్దు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉభయ వైఎస్సార్ జిల్లా ప్రయాణీకులు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

నందలూరు వాటరింగ్ పెట్టి ఉంటే..

ముంబై–చెన్నై రైలుమార్గంలో ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో వాటరింగ్‌కు అనుకూలమని జోన్, డివిజన్ స్థాయి ఉన్నతాధికారులకు తెలుసు. నందలూరు రైల్వే కేంద్రం నుంచి కడప రైలు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అయ్యేది. డివిజన్ కేంద్రానికి నందలూరు నీళ్లను రైల్వే ఉన్నతాధికారులు తెప్పించుకునేవారు. వాటరింగ్ ఉంటే తిరుమల లాంటి రైళ్ల రద్దు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉండవు కదా అని రైల్వేవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా జోనల్ అధికారులు నందలూరు నీటి వనరులను పరిగణనలోనికి తీసుకొని అన్ని రైళ్లకు వాటరింగ్ ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు.

హుబ్లీ ప్యాసింజర్ రద్దు..

తిరుపతి–హుబ్లీ (07657) మధ్య తిరిగే ప్యాసింజర్ రైలును కూడా ఈ నెల 4, 5, 9 తేదీల్లో రద్దు చేశారు. హుబ్లీ–తిరుపతి(07658) మధ్య నడిచే రైలును ఈనెల 5, 6, 10ను రద్దు చేశారు. పలురైళ్లను 17215, 00761 రైళ్లను దారిమళ్లించారు.12789, 22157 నంబర్ల గల రైళ్లను రీషెడ్యూలు చేసి నడిపిస్తున్నారు.

స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



క్రికెట్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి పట్టణ శివారు ప్రాంతమైన నక్కవాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్టోబర్ 2 కల్లా క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో పూర్తి చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. క్రికెట్ స్టేడియం వరకు రోడ్డు, ఆర్చి నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలన్నారు. స్టేడియంలో చూపరులను ఆకట్టుకునేలా మొక్కలు విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. 32 ఎకరాలలో నిర్మించే స్టేడియం పనులన్నీ నాణ్యతతో చేపట్టాలన్నారు. స్టేడియం మొత్తం రైన్ గన్‌తో తడిపి ఎత్తు పల్లాలు లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి అన్నమయ్య నూతన జిల్లాలో మంచి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఈఈ సహదేవరెడ్డి, డీఈ వెంకటసుబ్బయ్య , తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘కౌలు’ రైతులకు భరోసా

- అన్నదాతకు పెట్టుబడి సాయం కింద నిధులు
- నేడు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి రాయచోటి : అన్నదాతలకు జగన్ సర్కార్ ఎల్లప్పుడూ అండగా ఉంటోంది. ప్రకృతి విపత్తులు సంభవించినా..కరువు వెంటాడినా రైతులను వెంటనే ఆదుకుంటోంది. అంతేకాదు..కౌలు రైతుల కష్టాలు, కడగండ్లు తెలుసుకున్న ప్రభుత్వం వారికి కూడా రైతు భరోసా నిధులను అందిస్తోంది. ఎప్పుడూ లేని విధంగా దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులతోపాటు దేవదాయశాఖ భూములను సాగు చేసుకుంటున్న వాస్తవ సాగు దారులకు కూడా పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న కౌలు రైతుల ఖాతాలకు ప్రభుత్వం సొమ్ములను జమ చేయనుంది.

1280 మంది రైతులకు రూ. 90 లక్షలు

అన్నమయ్య జిల్లాలో సుమారు 4 వేల పైచిలుకు కౌలు దారులు ఉన్నారు. వారిలో అర్హులుగా ఉన్న రైతులను గుర్తించి నిధులను అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ ఏడాది అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న 1280 మంది కౌలు రైతులకు రూ. 90 లక్షల నిధులను కేటాయించారు. 2022–23కు సంబంధించి తొలి విడతగా ఒక్కో కౌలు రైతుకు రూ. 7500 చొప్పున అందించనున్నారు. మలి విడత అక్టోబరులో రూ. 4 వేలు, జనవరిలో రూ. 2 వేలు కలుపుకుని రూ. 13,500 జగన్ సర్కార్ రైతులకు అందించి సాగుకు సహకరిస్తోంది.

ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కౌలు రైతులకు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి నిధులు విడుదల చేసినంతరం ఎక్కడికక్కడ జిల్లాల్లో కార్యక్రమాలు చేపట్టి రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా కౌలు రైతులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మెగా చెక్కు అందించనున్నారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకుడు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆల కళ్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవమూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను సుగంధద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకించారు. నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి, తులసీ గజమాలతో అలంకరించారు. సతీసమేతుడైన కోదండరామ స్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మార్కెట్ కమిటీల బలోపేతం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్‌పాండే

మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్ పాండే

కడప అగ్రికల్చర్: మార్కెట్ కమిటీలను బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్‌పాండే సూచించారు. కడప కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రాయలసీమ పరిధి లోని ఎనిమిది జిల్లాల ఏడీలు, మార్కెట్ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ రుసుము పెంచాలన్నారు. మార్కెట్ యార్డు పరిధిలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను మార్కెట్ యార్డుకు తెచ్చి అమ్ముకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలువురి కార్యదర్శుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డితోపాటు 8 జిల్లా ఏడీలు, మార్కెట్ యార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యాన అధికారులతో సమీక్ష

చీనీ పండ్లు సూట్ లేకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమీషనర్ రాహుల్‌పాండే సూచించారు. కడప ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల, వేంపల్లి, వేముల, సింహాద్రిపురం ప్రాంతాల్లో రైతులు పండించిన చీనీ కాయల కొనుగోలు విషయంలో వ్యాపారులు సూట్ కింద కొంత తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కష్టపడి పండించిన పంట దిగుబడులను అదనంగా ఎందుకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మైఖేల్‌రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



నాపేరు లక్ష్మీ గాయత్రి. తల్లి భారతి, తండ్రి పార్థసారథి. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం, నాగులగుట్టపల్లి గ్రామంలో నివసిస్తున్నాం. కల్పన ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. విద్యా దీవెన కింద రూ.13 వేలు మా తల్లి ఖాతాలో జమ అయ్యాయి. పేదరికంతో ఎవరూ చదువు నిలిపివేయకూడదన్న ముఖ్యమంత్రి ఆశయం చాలా గొప్పది. సీఎంకు రుణపడి ఉంటాం.



నా పేరు కళ్యాణి. కలకడ మండలం. రాయచోటిలోని చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. జగన్ మామయ్య మా చదువుల కోసం ఆర్థిక సహకారం అందించడం చాలా సంతోషంగా ఉంది. బాగా చదువుకొని మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను బాగా చూసుకుంటాను.



నా పేరు సి పావని. రాయచోటి పట్టణంలో నివసిస్తున్నాం. మాది నిరుపేద కుటుంబం.నేను రాయచోటిలోని శ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 13వేలు మా తల్లి ఖాతాలో జమ అయ్యాయి. సిఎం జగన్ సార్ మా చదువుల కోసం ఎక్కువగా ఆలోచిస్తున్నారు.

జగనన్న దీవెనతో వెలుగులు


- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- జిల్లాలో 2023 ఏప్రిల్ – జూన్ త్రైమాసికానికి రూ. 24.42 కోట్లు జమ చేసిన ప్రభుత్వం



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్ (ఫైల్)

రాయచోటి: అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొస్తోంది. పేద విద్యార్థులకు చేయూతనివ్వడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ దాన్ని తూచా తప్పకుండా అమలు చేసింది. నిరుపేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడాలేని విధంగా అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి సకాలంలో బకాయిలు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికమే పిల్లల తల్లులకే చెల్లించి వారే కాలేజీలకు ఫీజులు కట్టేలా చేసి పేదల ఇంట విద్యా జ్యోతులు వెలిగిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద 2023 ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 34,568 మంది విద్యార్థులకుగాను అర్హులైన 31,743 మంది తల్లుల ఖాతాలలో రూ. 24.42 కోట్లు జమ అయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి వారి ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తే, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు విద్యా దీవెన, వసతిదీవెనలు అమలు చేస్తున్నారు. దీంతో పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

థ్యాంక్యూ జగన్ మామయ్య



నా పేరు ఆర్ ప్రభాకర్, అమ్మపేరు శివమ్మ, నాన్న పేరు లక్ష్మణ్ నాయక్. మాది గుత్తి మండలం, నేను రాయచోటిలోని కల్పన ఒకేషనల్ కాలేజ్‌లో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకోసం స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ఇచ్చి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నింపారు. అలాగే ఆయన తనయుడు విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టారు.పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. థ్యాంకూ జగన్ మామయ్య. –ఆర్ ప్రభాకర్, విద్యార్థి

వైఎస్‌ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం



వైఎస్‌ఆర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న భట్టి విక్రమార్క

వేంపల్లె: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. ఇడుపులపాయలోని వైఎస్‌ఆర్ ఘాట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాజశేఖరరెడ్డి సమాధికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న వైఎస్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రారంభం నుంచి చివరి వరకు పాల్గొన్న తమ వ్యక్తి గత సిబ్బంది వివిధ భాగాల్లో సేవలు అందించిన నాయకులు అందరూ దివంగత నేత వైఎస్‌ఆర్ ఆశీస్సులు తీసుకోవాలని భావించి ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. వైఎస్‌ఆర్ హయాంలో తాను శాసనమండలిలో సభ్యుడిగా, శాసన సభలో చీఫ్‌విప్‌గా పనిచేసినట్లు చెప్పారు.అంతేకాకుండా వైఎస్‌ఆర్‌కు తాను చాలా సన్నిహితంగా ఉండేవాడినన్నారు. ఆయనకు ప్రజా అభివృద్ధిపైన ఉన్న తపన ఎవ్వరికీ ఉండదన్నారు. ఆయన మరణం మనందరి దురదృష్టకరమని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి


మృతి చెందిన సుధాకర్

పీలేరురూరల్ : అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన కె. సుధాకర్ (37) కుమార్తె నందిని కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం కుమార్తెను పాఠశాలలో వదిలేందుకు తన ఆటోలో కోటపల్లెకు వెళ్లాడు. స్కూల్ వద్ద కుమార్తెను దించాడు. పాఠశాల బయట ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటో వద్దకు వెళ్లి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాలని కోరారు. ఓ వ్యక్తి ఆటో ఎక్కాడు. ఆటోలో వెనుక నుంచి ఏదో సూదితో గుచ్చినట్లు అనిపించడంతో డ్రైవర్ వెనుకకు తిరిగి చూశాడు. అంతలోనే ఆటోలోని వ్యక్తి పారిపోయాడు. కొంత సేపటికి సుధాకర్ సంఘటన స్థలంలో కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వీపుపై సూదితో గుచ్చిన గుర్తులు పోలీసులు గుర్తించారు. మృతునికి భార్యతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

లారీ ఢీ కొని..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయరహదారిలో ఊటుకూరు (రాజంపేట మండల) వద్ద బుధవారం రాత్రి లారీ ఢీ కొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని రాజంపేట రూరల్ ఎస్ఐ భక్తవత్సలం కోరారు. వివరాలకు 9121100573 (ఎస్ఐ), 9121100572 (సీఐ) లను సంప్రదించాలన్నారు.

సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు జిల్లా క్రీడాకారులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు చక్కటి ప్రతిభ కనబరిచారు. హాకీ క్రీడాంశంలో ప్రవీణ్‌కిరణ్ (పీడీ, చెమ్ముమియాపేట జెడ్పీ హైస్కూల్), ఎస్. గౌస్‌బాషా (డిజిటల్ అసిస్టెంట్, చెన్నూరు), జి. ఉదయ్ దీపు (డిజిటల్ అసిస్టెంట్, సిద్దవటం), యు. శివ (ఎడ్యుకేషన్ సెక్రటరీ, నకాష్, కడప)లు ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 8వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి సివిల్‌సర్వీసెస్ ఉద్యోగుల ఎంపికల్లో పాల్గొననున్నారు. వీరిని సెట్ప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్, హాకీ కోచ్ కల్యాణ్, శ్రీనివాసరాజు అభినందించారు.

రెయిన్‌గన్ల జాడేదీ..!

- జిల్లాలో ఎండిపోతున్న వేరుశనగ పంట
- ఆరేళ్లుగా టీడీపీ నేతల ఆధీనంలో రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు
- అప్పగించేందుకు ససేమిరా అంటున్న నాయకులు
- జిల్లాలో రూ.7కోట్ల పరికరాలు స్వాహా

గుర్రంకొండ : వేరుశనగ పంటను కాపాడేందుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్ల జాడే లేకుండా పోయింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ అవి టీడీపీ నాయకుల స్వాధీనంలోనే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగు చేసిన వేరుశనగ పంట వర్షాలు కురవక ఎండిపోయే దశకు చేరుకొంది. ఆరేళ్లుగా వ్యవసాయాధికారులు నాయకుల వద్ద ఉన్న రెయిన్ గన్లను స్వాధీనం చేసుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. కనీసం ఇప్పటికైనా వీటిని రికవరీ చేస్తే ఎండిపోతున్న వేరుశనగ పంటను కాపాడుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో నాయకులు వీటిని అమ్ముకొన్న సంఘటనలు చోటు చేసుకోగా మిగిలిన వారు తిరిగి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. నాయకులు రూ.7కోట్ల విలువ చేసే పరికరాలను స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

ఆరేళ్ల క్రితం మంజూరు

2017లో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో గత ప్రభుత్వం 2220 రెయిన్ గన్లు, 3350 స్ప్రింక్లర్ల యూనిట్లు, 1080 ఆయిల్ ఇంజిన్లు, 10585 పైపులను ఉచితంగా సరఫరా చేసింది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావంతో అప్పట్లో ఎండిపోయే దశకు చేరుకొంది. అప్పట్లో నెల రోజులపాటు వేరుశనగ పంటను కాపాడిన అధికారులు వాటిని తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేయాల్సి ఉంది. అయితే అప్పట్లో ఇవన్నీ అధికార పార్టీ నాయకుల ఇళ్లకు చేరుకొన్నాయి. పలుకుబడి కలిగిన అధికార పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు వాటిని తిరిగి ఇవ్వకుండా వారి వద్దే ఉంచుకొన్నారు. అప్పటినుంచి వ్యవసాయాధికారులు వాటి గురించి పట్టించుకొన్న దాఖలాలు లేవు.

రెండేళ్ల క్రితం స్వాధీనం చేసుకోవాలంటూ ఉత్తర్వులు

వేరుశనగ పంట సాగును, వర్షాలు కురవక పోతే పంటను కాపాడుకొనే విషయంపై ప్రస్తుత ప్రభుత్వం రెండేళ్ల క్రితమే దృష్టి సారించింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు, ఆయిల్ ఇంజిన్లపై వివరాలు ఆరా తీసింది. దీంతో అసలు విషయం తెలుసుకున్న ప్రభుత్వం వెంటనే వీటిని స్వాధీనం చేసుకొని వ్యవసాయశాఖ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలంటూ రెండేళ్ల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది.


ఎల్లుట్లలో ఎండిపోతున్న వేరుశనగ పంట

ససేమిరా అంటున్న దేశం నేతలు

ఆరేళ్లుగా తమ ఇళ్లలో భద్రపరుచుకొన్న వ్యవసాయ పరికరాలను తిరిగి వ్యవసాయశాఖకు అప్పగించేందుకు తెలుగుదేశం నేతలు గ్రామాల్లో ససేమిరా అంటున్నారు. ముఖ్యంగా జన్మభూమి కమిటీ భ్యులు తమ వద్దలేవంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు తలలు పట్టుకొంటున్నారు. ఇప్పటికే పలువురు దేశం నేతలు వాటిని విక్రయించినట్లు విచారణలో తేలింది.


గ్రామాల్లో టీడీపీ నాయకుల వద్ద ఉంచుకొని వినియోగించుకుంటున్న రెయిన్ గన్లు

ఎండిపోతున్న వేరుశనగ పంటలు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 30 నుంచి 35 శాతం మేరకు వేరుశనగ పంట సాగుచేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గ్రామాల్లో వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే ఎండిపోయే దశకు చేరుకొన్నాయి. టీడీపీ నేతల వద్ద ఉన్న రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లను రికవరీ చేసి ప్రస్తుతం వేరుశనగ పంట సాగు చేసిన రైతులకు అందిస్తే కనీసం ఈ ఏడాది పంటను కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఇప్పటికైనా వీటిని అందిస్తే పంటను కాపాడుకోవడంతో పాటు పంట దిగుబడి చేతికొచ్చే అవకాశముంది.

రికవరీ చేసింది గోరంత

వ్యవసాయాధికారులు ఆరేళ్లుగా రికవరీ చేసింది గోరంత, చేయాల్సింది కొండంతగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 2220 రెయిన్ గన్లకు 580, 3350 స్ప్రింక్లర్ల యూనిట్లకు 965, 1080 ఆయిల్ ఇంజన్లకు 225, 1,05,585 పైపులకు 9855 మాత్రమే అధికారికంగా రికవరీ చేశారు.

జిల్లాకు మంజూరైన పరికరాలు, అధికారులు వసూలు చేసిన పరికరాల వివరాలు

పేర్లు	జిల్లాకు మంజూరైనవి (2017లో)	రికవరీ చేసినవి (ప్రస్తుతం)
రెయిన్‌గన్లు	2220	580
స్ప్రింక్లర్ల యూనిట్లు	3350	965
ఆయిల్ ఇంజిన్లు	1080	225
పైపులు	1,05,585	9855

వేరుశనగ పంట ఎండిపోతోంది



ఈ ఏడాది రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోతోంది. కొద్దిరోజుల పాటు పంటను కాపాడుకుంటే పంట దిగుబడి చేతికొస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే బాగుటుంది. రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు అందజేస్తే పంటను కాపాడుకుంటాం. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

\- రామయ్య, కొత్తిండ్లవారిపల్లె

నాయకుల దగ్గరే ఉన్నాయి



ఆరేళ్లుగా రెయిన్‌గన్లు, స్ప్రింకర్లు, ఆయిల్ ఇంజిన్లను టీడీపీ నాయకులు వారి వద్దే ఉంచుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై అప్పట్లో దౌర్జన్యాలకు దిగారు. టీడీపీ నాయకులకు తప్ప వేరుశనగ పంట సాగు చేసుకొని పంట ఎండిపోతున్న సాధారణ రైతులకు వీటిని అప్పగించిన దాఖలాలు లేవు. అధికారులు ఇప్పటికైనా వాటిని స్వాధీనం చేసుకోవాలి.

\- జానకీరామిరెడ్డి, రెడ్డివారిపల్లె

కొద్దిగా రికవరీ చేశాం



నాయకుల దగ్గర ఉన్న పరికరాలను కొద్దిమేరకు రికవరీ చేశాం. ఇంకా చేయాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో వాటిని వినియోగించక తుప్పుపట్టిపోయాయి. గతంలో ఆర్బీకేలో పనిచేసే సిబ్బంది ద్వారా నాయకులకు నోటీసులు జారీ చేశాం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా వారు స్పందించడం లేదు. మిగిలిన పరికరాలను రికవరీ చేసేందుకు చర్యలు చేపడతాం.

\- వాణిశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

అవగాహనతో మెరుగైన పనితీరు

- పంచాయతీ కార్యదర్శులదే ప్రధాన పాత్ర
- ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జె.మురళి


అంగళ్లులో జరుగుతున్న శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జె. మురళి

కురబలకోట : పంచాయతీ చట్టాలపై కార్యదర్శులకు అవగాహన ఉంటే సమర్థత, నిబద్ధత వస్తుందని తద్వారా మెరుగైన పనితీరుకు ఆస్కారం ఉంటుందని ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ (ట్రైనింగ్ సెంటర్స్) డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా గ్రామ కార్యదర్శులకు అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో జరుగుతున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకమైనదన్నారు. చీకట్లో బాణం విసిరినట్లుగా కాకుండా పంచాయతీ చట్టాలపై అవగాహన ఉంటే గురి చూసి కొట్టవచ్చన్నారు. స్వపరిపాలన, సమావేశాల నిర్వహణ, విధులు, బాధ్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వచ్ఛ భారత్, స్వామిత్వ, రికార్డుల నిర్వహణ, లే అవుట్లు, జవాబుదారి తనం తదితర వాటిపై సమగ్ర అవగాహన కల్పిస్తామన్నారు. తద్వారా వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు విజయవంతంగా గ్రామ పాలన సాగించగలరన్నారు. శిక్షణలో రాటుదేలి గ్రామ వికాసానికి పాటుపడాలన్నారు. ప్రజల మన్ననలు పొందాలన్నారు. మరో వైపు కార్యదర్శులు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, డీఎల్‌పీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. గురువారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్‌లో గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగా తాలూకా పోలీసులకు అందిన సమాచారం మేరకు గతనెల 31వతేదీ గురువారం మండలంలోని తట్టివారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద మదనపల్లె పట్టణం చంద్రాకాలనీకి చెందిన పూల సంతోష్ అలియాస్ సంతూ (30), పట్టణంలోని మంజునాథకాలనీకి చెందిన అంకిశేపల్లి శివ(30) ఇద్దరు నిందితులను అదుపు తీసుకుని వారి వద్ద నుంచి రూ.20 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీసీ యాక్టు మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు. గంజాయి కేసుల్లో నిందితులైన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ సత్యనారాయణ

షోలాపూర్ వాసి నందలూరులో మృతి


యువకుడి మృతదేహం

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలోని మొదటి ప్లాట్‌ఫాంపై గురువారం షోలాపూర్‌కు చెందిన మహేష్ (25) కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ కింద ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. రిజర్వేషన్ బోగీ డోర్ వద్ద నిలబడి ఉన్న తరుణంలో ప్రమాదానికి గురయ్యాడు. అది కూడా స్టేషన్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్ చికిత్స చేశారు. 108లో తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ముగ్గురు స్నేహితులతో కలిసి కొల్హాపూర్ రైలులో తిరుపతికి బయలు దేరాడు.

భార్యపై భర్త హత్యాయత్నం

- వెంటాడి నడిరోడ్డులో మచ్చుకత్తితో దాడి
- పరిస్థితి విషమం


భర్త దాడిలో కత్తిపోట్లకు గురై సంఘటన స్థలంలో తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పి పడిపోయిన లక్ష్మిదేవి



లక్ష్మిదేవి (ఫైల్), దాడికి పాల్పడ్డ నిందితుడు రఘు

మదనపల్లె : భార్యపై భర్త మచ్చుకత్తితో నడిరోడ్డులో వెంటబడి విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. మండలంలోని సీటీఎం పంచాయతీ చిలకలవారిపల్లెకు చెందిన లక్ష్మిదేవి (53), ఆమె భర్త రఘు గత కొన్ని సంవత్సరాలుగా మదనపల్లె రెడ్డప్పనాయుడు కాలనీలో నివాసముంటూ, తోపుడు బండిపై ఇద్దరూ పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ క్రమంలో రఘు మద్యానికి బానిసై పండ్ల వ్యాపారం సక్రమంగా చేయకుండా, వ్యాపారంలోని నగదును దుర్వ్యసనాలకు ఖర్చు చేస్తూ జులాయిగా మారాడు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల కుమారుడు బాలాజీపై దాడి చేసి గాయపరచగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశారు. గొడవల కారణంగా లక్ష్మిదేవి భర్తకు దూరంగా తాము నివాసమున్న ప్రాంతంలో బంధువుల ఇంటిలో ఉంటోంది. గురువారం తెల్లవారుజామున ఆమె వ్యాపార నిమిత్తం ఇంటి నుంచి బయటకు రాగానే రఘు ఆమెతో గొడవకు దిగాడు. ఆమె అతనినుంచి తప్పించుకుని వెళుతుండగా మచ్చుకత్తితో ఆమెను వెంటబడి బాపూజీ పార్కు వద్ద నడిరోడ్డులో విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో లక్ష్మిదేవి తల, చేతులు, వీపుపై తీవ్ర గాయాలై సంఘటన స్థలంలో తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. కాగా దాడికి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టు టౌన్ ఇన్‌చార్జి సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

తొలగించిన ఓట్లపై సమగ్ర విచారణ

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

వాల్మీకిపురం : తొలగించిన ఓట్లపై సమగ్ర విచారణ జరపాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం మండలంలోని తాటిగుంటపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తొలగించిన ఓట్లకు సంబంధించి సమగ్ర విచారణ జరపాలని, ఎక్కడైనా అర్హులైన ఓటర్లను తొలగిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటింటికి వెళ్లి సమగ్ర ఓటరు జాబితాను తయారు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించి, రెవెన్యూ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఓటర్ల నమోదు, పరిశీలనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న స్కూల్‌బస్సు





తీవ్రంగా గాయపడిన కవిత, ఆటో డ్రైవర్ వాసుదేవ, సయ్యద్‌సాహెబ్ అలియాస్ బాబు

మదనపల్లె : స్కూల్ బస్సు ఆటోను ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం నుంచి ప్యాసింజర్లతో కూడిన ఆటో మదనపల్లెకు వస్తుండగా శానిటోరియం సమీపంలోని తురకపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సు ఆటోను ఢీకొంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ వాసుదేవ(37), మదనపల్లె మండలం తట్టివారిపల్లెకు చెందిన కవిత(48), వాల్మీకిపురం పట్టణానికి చెందిన సయ్యద్‌సాహెబ్ అలియాస్ బాబు (50) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కవిత, వాసుదేవ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




'రాఖీ' కట్టించుకుని వస్తుండగా..

- లారీ ఢీకొని..
- తల్లి దుర్మరణం, కుమారుడికి తీవ్రగాయాలు


కృష్ణవేణి (ఫైల్)

కడప అర్బన్ : అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రతీకగా.. రాఖీని పౌర్ణమి రోజున రాఖీ కట్టించేందుకు తన కుమారులను, తన బావ కుమార్తె వద్దకు పిలుచుకుని వచ్చింది. రాఖీని తన కుమారులిద్దరికీ కట్టించింది. ఎంతో ఆనందంగా గడిపారు. ఆ ఆనందం కొన్ని నిమిషాల్లోనే ఆవిరైపోయింది రోడ్డు ప్రమాదం రూపంలో మహిళ నిండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఈ సంఘటనపై కడప రిమ్స్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఒంటిమిట్ట మండలం చెంచుగారిపల్లెకు చెందిన చిన్నయ్యగార్ల కృష్ణవేణి(29), తన కుమారులు తేజకుమార్ (5), మరో కుమారుడు (3)తో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త లక్ష్మీనరసయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కృష్ణవేణి బావ కుమార్తె లోకిత(12) కడప చిన్నచౌక్ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఈ క్రమంలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా లోకితతో, తన కుమారులు ఇద్దరికి రాఖీలను కట్టించాలని, తన తోడికోడలుతో పాటు, కుమారులను పిలుచుకుని గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. లోకిత తన బాబాయి కుమారులైన ఇద్దరికి రాఖీ కట్టింది. తరువాత కృష్ణవేణితో పాటు, కుమారులు, తోడికోడలు బయటకు వచ్చి రోడ్డు దాటుకుంటుండగా, భాకరాపేట వైపు నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన తేజకుమార్‌ను రిమ్స్‌కు తీసుకెళ్లారు. తరువాత మెరుగైన చికిత్సకోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కడప రిమ్స్ ఔట్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, రిమ్స్ పోలీసు స్టేషన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తోడికోడలు రాజేశ్వరి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు




రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలీ, రమీజా, చికిత్స పొందుతున్న బాల కుల్లాయప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం రింగురోడ్డు సమీపంలో శ్రీకృష్ణదేవాలయం వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని స్కార్పియో ఢీకొన్న సంఘటనలో భార్యాభర్తలు దుర్మరణం చెందగా వారి కుమారునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో ఉన్న ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన వలీ, రమీజాలకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడైన బాలకుల్లాయప్పకు కడుపునొప్పి రావడంతో చికిత్స కోసం పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. భాకరాపురం శ్రీకృష్ణ దేవాలయం రింగురోడ్డు వద్దకు రాగానే కడప నుంచి సింహాద్రిపురం వెళ్తున్న స్కార్పియో ఢీకొంది. ఈ సంఘటనలో ఊడవగండ్ల వలీ (42), ఆయన భార్య రమీజా (38) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బాలకుల్లాయప్పను చికిత్స కోసం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పరాంపల్లెలో విషాద ఛాయలు..

ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన వలీ, రమీజాలు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాఖీ పౌర్ణమి రోజు ఇంటి దగ్గర ఆనందంగా గడిపిన ఆ ఇంట ఒక్కసారిగా విషాదం అలుముకుంది. దంపతులు మృతిచెందడంతో బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు.

వలీ కుటుంబానికి అండగా ఉంటాం..

ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన వలీ, ఆయన భార్య రమీజా మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్‌లు ఆసుపత్రి వద్దకు చేరుకుని మృతదేహాలను సందర్శించారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.